క్లుప్తంగా

అలరించిన భక్తిగీతాలాపన



భక్తిగీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళా వేదికపై బాపట్లకు చెందిన చంద్రమౌళీశ్వర భజన సమాజం వారిచే నిర్వహించిన భజన భక్తులను అలరించింది. ఈ కార్యక్రమంలో మహాగణపతిం, శివశివ శంకరా, శంభో హర హర మహాదేవ, లింగాష్టకం, శ్రీశైలవాస, పార్వతీనాథుడా, శ్రీగిరి మల్లయ్య, పాతాళగంగమ్మ, కై లాసవాసుని, కై లాసగిరివాసా మొదలైన పలు భక్తిగీతాలను, భజనకీర్తనలను అంజమ్మ, వరలక్ష్మి, రత్నమ్మ, సుబ్బారావు, మాధవి, సుధారాణి, అంజలి, వెంకట్రావు, రాజేశ్వరి తదితరులు ఆలపించారు.

హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో క్యాన్సర్ నివారణ



టీకా గురించి వివరిస్తున్న డాక్టర్ రవీంద్రబాబు

జూపాడుబంగ్లా: హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో పదిర కాల క్యాన్సర్‌ను నివారించవచ్చునని బచ్చు జానకీరాం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ రవీంద్రబాబు తెలిపారు. ప్రపంచ ఆరోగ్యదినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్యాన్సర్ వ్యాధి వ్యాప్తి–టీకాతో నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ గ్రామస్తుల విన్నపం మేరకు పాఠశాల విద్యార్థుల కోసం రూ.10లక్షలతో భోజనశాలతో పాటు హెచ్‌పీవీ టీకాను 180 మంది చిన్నారులకు ఉచితంగా వేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే జయసూర్య, గౌరువెంకట రెడ్డి, మాండ్రశివానందరెడ్డి, సర్పంచ్ అంజనమ్మ, వెంకటేశ్వర్లుయాదవ్ పాల్గొన్నారు.కాగా కార్యక్రమంలో పాల్గొనే వారికి స్వాగతం పలికడంలో భాగంగా వారిపై పూలు చల్లాలను విద్యార్థినులను దాదాపు 2గంటల పాటు ఎండలో నిలబెట్టడం విమర్శలకు దారితీసింది.

అభయాంజనేయుడికి ఆకుపూజ



దీపాలంకరణలో ఆంజనేయస్వామి

మహానంది: శ్రీరామనవమిని పురస్కరించుకుని మహానంది ఆలయంలో కొలువైన అభయ ఆంజనేయ స్వామికి ఆదివారం దీపార్చన పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ఉప ప్రధాన అర్చకుడు మూలస్థానం శంకరయ్య శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి 108 దీపాలతో దీపార్చన, ఆకుపూజ శాస్త్రోక్తంగా చేపట్టారు. మహానందీశ్వరస్వామి దర్శనానికి వచ్చిన వివిధ ప్రాంతాల భక్తులు అభయ ఆంజనేయ స్వామిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం, గాజులపల్లె, గోపవరం, బుక్కాపురం, మసీదుపురం, నందిపల్లె, సీతారామపురం, తమ్మడపల్లె, బొల్లవరం, గాజులపల్లె ఆర్ఎస్, అల్లినగరం, అబ్బీపురం గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరిగాయి.

బెల్లం ఊట ధ్వంసం



నీలిషికారిపేటలో బెల్లం ఊట ధ్వంసం చేస్తున్న పోలీసులు

నందికొట్కూరు: నాటు సారాయి తయారు చేస్తే చట్ట పరమైన కఠిన చర్యలు తప్పవని టౌన్ ఎస్ఐ చంద్రశేఖర్ హెచ్చరించారు. ఆదివారం పట్టణ పరిధిలోని నీలిషికారిపేటలో నాటు సారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన 1500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అలాగే 20 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులు భక్తిభావాన్ని అలవర్చుకోవాలి



గిరిజనులకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: గిరిజనులు భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని కర్నూలు జిల్లా రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ రామస్వామి, రిటైర్డ్ జిల్లా టీబీ నివారణాధికారి మోక్షేశ్వరుడు అన్నారు. ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా సమరసతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భ్రమరాంబ గూడెంలోని రామాలయంలో గిజనులకు చీరలు, టవళ్లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ గిరిజనులు తమ పిల్లలను చదివించాలని సూచించారు. రిటైర్డ్ తహసీల్దార్ రామకృష్ణ, టీబీ సూపర్‌వైజర్ మస్తానయ్య, రామాలయ కమిటీ అధ్యక్షుడు హనుమంత రెడ్డి, గిరిజనులు పాల్గొన్నారు.



శ్రీశైలం: ప్రత్యేక అలంకరణలో స్వామివారు,





మహానందిలో సీతారాముల కల్యాణాన్ని జరిపిస్తున్న వేదపండితులు, ఆత్మకూరులో..,



కరివేనలో పూజలందుకున్న స్వామివారు,



వెలుగోడు: కల్యాణోత్సవంలో పాల్గొన్న ఆర్యవైశ్యులు

కల్యాణం.. కమనీయం



మహానంది: స్వామివారి గ్రామోత్సవం



ఆత్మకూరు: కరివేన గ్రామంలో సీతారాముల కల్యాణానికి హాజరైన భక్తులు



శ్రీశైలం ప్రాజెక్ట్: సీతారాముల కల్యాణ వేడుక



శ్రీశైలం: సీతారాముల కల్యాణం

- భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి వేడుకలు
- ఊరూరా సీతారాముల కల్యాణం
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కల్యాణోత్సవంలో నంద్యాల మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.వాసు, నంద్యాలలోని ఏజీఎస్ జ్యువెలర్స్ అధినేత అవ్వారు గౌరీనాథ్ దంపతులు దాతలుగా పాల్గొన్నారు. వేదపండితులు చెండూరి రవిశంకర అవధాని, అర్చకులు వనిపెంట జనార్ధనశర్మ, వనిపెంట ప్రకాశం శర్మ సీతారాముల వారి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా జరిపించారు. ఏఈఓ మధు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు నాగమల్లయ్య, సుబ్బారెడ్డి, ఏఈ శ్రీనివాసులు యాదవ్ పాల్గొన్నారు. సాయంత్రం సీతాసమేత రాముల వారు హనుమద్వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.

రాములోరికి పట్టువస్త్రాల సమర్పణ

శ్రీరామనవమి సందర్భంగా మహానందిలో కొలువైన సీతారాముల వారికి ఆదివారం జరిగిన కల్యాణోత్సవానికి నంద్యాల మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.వాసు దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. వారికి ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, వేదపండితుడు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని స్వాగతం పలికారు. స్వామి, అమ్మవారి కల్యాణ మండపం నుంచి న్యాయమూర్తి పి.వాసు దంపతులతో పాటు మరో దాత గౌరీనాథ్ దంపతులు, పండితులు పట్టు వస్త్రాలు, తాళిబొట్టుతో పాటు పూజా కై ంకర్యాల సామగ్రిని మేళతాళాల మధ్య అభిషేక మండపం వరకు తీసుకొచ్చారు.

శ్రీశైలంలో వైభవంగా సీతారాముల కల్యాణం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన అనుబంధ ప్రసన్న ఆంజనేయస్వామివారి ఆలయ ప్రాంగాణంలోని రామాలయంలో సీతారామస్వామివారి కల్యాణ మహోత్సవం వేడుకగా జరిగింది. ముందుగా మహాగణపతిపూజ, పుణ్యాహవచనం, కంకణదారణ, యజ్ఞోపవీతపూజ, వస్త్ర సమర్పణ, వరపూజ, గౌరీపూజ, సీతాదేవివారికి మాంగల్యధారణ, తలంబ్రాలు మొదలైన కార్యక్రమాలతో సంప్రదాయబద్ధంగా సీతారామ కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, ఏఈఓ హరిదాసు, పర్యవేక్షకుడు కె.అయ్యన్న పాల్గొన్నారు.

- **ఆత్మకూరు:** పట్టణంతో పాటు మండలంలోని కరివేన, ముష్టపల్లి, సిద్ధపల్లి, కురుకుంద, ఇందిరేశ్వరం, కృష్ణాపురం గ్రామాల్లోని ఆలయాల్లో సీతారాముల కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. భక్తులకు పానీయాలు, భోజనాలు వడ్డించారు.
- **ఆత్మకూరురూరల్:** ఆత్మకూరు మండలం కరివేన గ్రామంలో శ్రీ సీతారామ కళ్యాణం అత్యంత వైభవంగా జరిగింది.శ్రీరామనవమి సంధర్బంగా ఆదివారం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అత్యంత శాస్త్రోక్తంగా వేద పండితుల నిర్వహణతో కళ్యాన మహోహత్సవం జరిగింది.
- **వెలుగోడు:** పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. పురోహితుడు మధు శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. వాసవీ కల్యాణ మండపంలో సోమవారం వనభోజనం ఏర్పాటు చేసినట్లు కమిటీ నాయకుడు లాలం శ్రీనివాసులు తెలిపారు.

- **శ్రీశైలంప్రాజెక్ట్:** శ్రీశైలంప్రాజెక్ట్ కాలనీలోని మర్చంట్స్ అసోసియేషన్ పెళ్లి పందిరిలో సీతారాము కల్యాణం వైభవంగా జరిగింది. అనంతరం భక్తులకు వడపప్పు, బెల్లం పానియాన్ని ప్రసాదంగా అందించారు. అలాగే క్షేత్ర పరిధిలోని లలితాంబిక వాణిజ్య సముదాయం సిద్ధిరామప్ప కాంప్లెక్స్‌లో ఉన్న వ్యాపారంతా కలిసి రథశాల ఎదుట సీతారామ కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.



సీతారాముల వారి విగ్రహాలను కల్యాణ మండపానికి తెస్తున్న భక్తులు



కల్యాణం అనంతరం సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి





ఎదురుపాడు రామాలయంలో, కొత్తపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని జరిపిస్తున్న పురోహితులు



మిడుతూరు మండలం సుంకేసుల గ్రామంలో రథోత్సవం





సాయిబాబా ఆలయంలో సీతారాముల వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, వేడుకను తిలకిస్తున్న భక్తులు



పాములపాడులో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు



కల్యాణ మహోత్సవానికి తలంబ్రాలతో హాజరైన మహిళలు

- **నందికొట్కూరు:** నియోజకవర్గంలో సీతారాముల కల్యాణం వైభవంగా ఆదివారం జరిగింది. స్థానిక రాజా వీధిలో ఉన్న రామాలయంలో రామ నామం మార్మోమోగింది. రాములోరి కల్యాణం కమనీయంగా జరిగింది. అనంతరం ఆత్మకూరు రోడ్డు ఎస్సీ హాస్టల్ వరకు రథోత్సవం నిర్వహించారు.
- **కొత్తపల్లి:** మండలంలో ప్రజలు శ్రీరామనవమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఆదివారం జరుపుకున్నారు. మండలంలోని ఎర్రమఠం, ముసలిమడుగు, శివపురం, కొక్కెరంచ, దుద్యాల, గువ్వలకుంట్ల,వీరాపురం, బావాపురం, నందికుంట గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు భక్తితో శ్రీరామనవమి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఎదురుపాడు గ్రామంలో రామలయంలో పురోహితులు హరికృష్ణ, రాముల ఆధ్వర్యంలో, కొత్తపల్లిలోని ఆంజనేయ స్వామి దేవస్థానం, శ్రీసీతారామ లక్ష్మణ ఆలయంలో పురోహితులు లక్ష్మీనరసయ్య శర్మ సీతారాముల కళ్యాణ మహోత్సవాలు అలరించాయి.
- **జూపాడుబంగ్లా :** శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని ఆదివారం మండలంలోని తాటిపాడు, జూపాడుబంగ్లా, తూడిచెర్ల, తర్తూరు, మండ్లెం, పారుమంచాల, తూడిచెర్ల, 80బన్నూరు, తంగడంచ తదితర గ్రామాల్లో కనుల పండువగా సీతారాముల కల్యాణాన్ని భక్తులు జరిపించారు. ఆరాధ్యదైవమైన సీతారాముల కల్యాణ వేడుకలను తిలకించేందుకు ఆయా గ్రామాల్లోని భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

నేడు రథోత్సవం

పగిడ్యాల: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక లక్ష్మీచెన్నకేశవస్వామి రథోత్సవం జరిపిస్తామని దేవదాయ కార్యనిర్వాహక, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, గ్రామ పెద్దలు తెలిపారు.

- **పగిడ్యాల:** శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా మండలంలోని నెహ్రూనగర్, పాత, కొత్త ముచ్చుమర్రి, పగిడ్యాల, సంకిరేణిపల్లె, బీరవోలు, లక్ష్మాపురం, తూర్పు, పడమర ప్రాతకోట, ఎం.ఎస్. ఘణపురం గ్రామాల్లో ఆదివారం సీతారాముల కల్యాణ వేడుకలు కమనీయంగా సాగాయి. భక్తుల ఆనందోత్సవాల మధ్య కొనసాగిన కల్యాణ వేడుకలను పురోహితులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. కళ్యాణ వేడుకల్లో సతీసమేతంగా పాల్గొన్న పుణ్యదంపతులు స్వామి వార్లకు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. తూర్పు ప్రాతకోట ఆంజనేయ స్వామి దేవాలయంలో జరిగిన సీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకల్లో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి నూనేపల్లి హరినాథ్‌రెడ్డి సతీసమేతంగా పాల్గొని తిలకించారు. ఈ వేడుకలకు హాజరైన జడ్జికి నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, ముచ్చుమర్రి ఎస్ఐ శరత్‌కుమార్ రెడ్డి పూల బొకే అందజేసి స్వాగతం పలికారు.
- **పాములపాడు:** శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల్లో సీతారాముల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. సంప్రదాయ పద్ధతిలో కల్యాణం వైభవోపేతంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మహోత్సవాన్ని తిలకించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు చేశారు.



హైకోర్టు జడ్జికి పూలబొకే అందజేస్తున్న సీఐ సుబ్రహ్మణ్యం, ముచ్చుమర్రి ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



లింగాపురంలో జరుగుతున్న బండలాగుడు పోటీలు

బండి ఆత్మకూరు: శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని మండల పరిధిలోని లింగాపురం గ్రామంలో ఆదివారం ఆరు పళ్ల ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. మొత్తం ఆరు జతల ఎడ్లు పాల్గొన్నాయి. నాగర్ కర్నూలు జిల్లా రాయవరం గ్రామానికి చెందిన ఎం. అక్షరారెడ్డి ఎద్దులు విజేతగా నిలిచి రూ.30 వేల నగదు బహుమతి దక్కించుకున్నాయి. నంద్యాల మండలం పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన బోరెడ్డి నారాయణరెడ్డికి చెందిన ఎద్దులు ద్వితీయ స్థానంలో నిలిచి రూ. 20 వేలు, కలసపాడుకు చెందిన బేతి వెంకటరెడ్డి ఎద్దులు తృతీయ స్థానంలో నిలిచి రూ. 15 వేలు, నంద్యాల మండలం కానాల గ్రామానికి చెందిన సుబ్రమణ్యం ఎద్దులు నాలుగో స్థానంలో నిలిచి రూ. 10 వేలు, చాబోలు గ్రామానికి చెందిన లింగన్న ఎద్దులు ఐదో స్థానంలో నిలిచి రూ. 5 వేలు నగదు గెలుపొందాయి.


రజకుల మహాసభను విజయవంతం చేద్దాం



పోస్టర్లను విడుదల చేస్తున్న రజక సంఘం నాయకులు

ఆత్మకూరు: రజక వృత్తిదారుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం 7వ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కన్వీనర్ వెంకటేశ్వర్లు, నాయకుడు శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం ఆత్మకూరులోని రజక సంఘం కార్యాలయంలో మహాసభలను పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో రజక వృత్తిదారులపై దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు అధికమయ్యాయన్నారు. రజకుల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించి రజకుల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20, 21 తేదీల్లో ఎన్‌టీఆర్ జిల్లా కొండపల్లి పట్టణంలో రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శ్రీరాములు, శివుడు, శివకేశవుడు, వెంకటస్వామి, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

తరగతుల విలీనాన్ని ఆపాలి



ఎమ్మెల్యే జయసూర్యకు వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

నందికొట్కూరు: 3, 4, 5 తరగతుల విలీనాన్ని ఆపాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, కార్యదర్శి ముర్తుజావలి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని అల్లూరు గ్రామంలో టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే జయసూర్యకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 117 జీవో రద్దు చేస్తున్నట్లుగా జనవరి 9న పాఠశాల విద్యాశాఖ కమిషనర్ మెమో ఉత్తర్వులు వెల్లడించాన్నారు. తల్లిదండ్రుల పూర్తిస్థాయి ఆమోదంతోనే మార్పులు చేపడతామని చెప్పినప్పటికీ క్షేత్రస్థాయిలో డ్రాఫ్ట్ ఉత్తర్వులు అమలు చేస్తున్న తీరు ఆదోళనకరంగా ఉందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన డ్రాఫ్ట్‌కు పూర్తి భిన్నంగా 3, 4, 5 తరగతుల పిల్లలను ఇతర ప్రాథమిక పాఠశాలలకు మ్యాపింగ్ చేయాలని ఉన్నతాధికారులు ఒత్తిడి చేయడం తగదన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో సింగిల్ టీచర్ పాఠశాలలు 20 వేలకు పైగానే ఏర్పడతాయన్నారు. చంద్రశేఖర్, జగదీష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

పాములపాడు:ఉపాధి కూలీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర రావు అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జిల్లా కార్యవర్గం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 10 వారాలుగా కూలి ఇవ్వకపోవడం దారుణమన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు నరసింహ నాయక్, సుధాకర్, బాలయ్య, పకీర్‌సాహెబ్, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

రేపు ఎదురుపాడులో అంతర్రాష్ట్ర పొట్టేళ్ల పోటీలు

కొత్తపల్లి:మండలంలోని ఎదురుపాడు గ్రామంలో శ్రీరామనవమి పర్వదినం, రథోత్సవం సందర్భంగా ఈనెల 8వ తేదీన అంతర్రాష్ట్ర పొట్టేళ్ల పోటీలు (ఫ్రీ విభాగం)నిర్వహిస్తామని నిర్వాహకులు ఆదివారం తెలిపారు. పాల్గొనే వారు ప్రవేశ రుసుము రూ.200 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. గెలుపొందిన పొట్టేళ్ల యజమానులకు వరుసగా.. రూ.8వేలు, రూ.5వేలు, రూ.3వేలు అందజేస్తామని చెప్పారు. వివరాలకు సెల్: 7569671848, 8639183516 నంబర్లలో కోరారు.

విజయవంతం చేయండి

నందికొట్కూరు: మాలల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే ఐజయ్య పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని అఖిల భారత మాలమహానాడు జేఏసీ కార్యాలయంలో మాలల ఆత్మగౌరవ సభ వాల్ పోస్టర్లను మాలమహానాడు జేఏసీ రాయలసీమ గౌరవ అధ్యక్షులు చెరుకు అశోక్‌రత్నం, ఎస్సీ, ఎస్టీ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోన నాగరాజు, సభ్యులు తమ్ముడపల్లి ఏసేపు, డాక్టర్ చంద్రశేఖర్, రాజు, దేవభక్తుడుతో కలిసి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మే 26న నందికొట్కూరులో వర్గీకరణకు వ్యతిరేకంగా జరిగే సభకు గ్రామీణ ప్రాంతాలను మాలలు తరలిరావాలని కోరారు. శీలం శేషు, అబ్రహం, మధు, భాస్కర్, ఏసన్న, పాల్గొన్నారు.

లక్ష్మీరంగనాథుడికి పట్టువస్త్రాల సమర్పణ



స్వామి, అమ్మవారికి తెచ్చిన పట్టువస్త్రాలను అర్చకులకు అందజేస్తున్న తహసీల్దార్ దంపతులు

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథ స్వామివారి బ్రహ్మోత్సవాల ప్రారంభాన్ని పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, రజినీబాయి దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. బ్రహ్మోత్సవాల మొదటిరోజున ప్రభుత్వం తరఫున స్వామి,అమ్మవార్లకు 18ఏళ్ల నుంచి పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా తహసీల్దారు దంపతులు అధికార లాంఛనాలతో పట్టువస్త్రాలు తేగా వారికి దేవాలయ ఈఓ సాయికుమార్, చైర్మన్ నారాయణరెడ్డి, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పట్టువస్త్రాలను అర్చకులు స్వామివారికి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆత్మకూరు తహసీల్దార్ రత్నరాధిక, కొత్తపల్లి తహసీల్దార్ ఉమారాణి, సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

నీరు కలుషితం కాలేదు



ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు వద్ద నీటిని పరిశీలిస్తున్న డీఈఈ శ్రీనివాసరెడ్డి

పాములపాడు: ఓహెచ్ఎస్ఆర్ నీరు కలుషితం కాలేదని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని ఇస్కాల గ్రామంలో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నీటిని పరిశీలించి పరీక్షలు చేశారు. ట్యాంకును శుభ్రం చేయించి మరోసారి ట్యాంకును నీటితో నింపారు. మళ్లీ నీటిని పరీక్షించారు. రెండు పర్యాయాలు నీటిలో ఎలాంటి సమస్య లేదని నిర్ధారించినట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ఆదేశించారు. సర్పంచు మౌలాలి, ఏఈ మహ్మద్‌జుబేర్, పంచాయతీ కార్యదర్శి నాగశేషులు ఉన్నారు.

మహిళా సర్పంచ్‌కు అవమానం



ఎమ్మెల్యే జయసూర్య, మాండ్రశివానందరెడ్డి, గౌరువెంకటరెడ్డి, మరికొందరు కుర్చీలో కూర్చొని ఉండగా నిల్చున్న తరిగోపుల సర్పంచ్ అంజనమ్మ

జూపాడుబంగ్లా: టీడీపీలోనే బీసీలకు, మహిళలకు సముచిత న్యాయం, గౌరవం లభిస్తుందని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చే తెలుగు తమ్ముళ్లు బీసీ మహిళా సర్పంచ్‌కు కుర్చీ వేయకుండా తాము మాత్రమే కూర్చొని ఆమెను నిలబెట్టి అగౌరవ పర్చిన ఘటన మండలంలోని తరిగోపుల గ్రామంలో ఆదివారం చోటుచేసుకొంది. గ్రామంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా క్యాన్సర్ వ్యాధి వ్యాప్తి, టీకాతో నివారణపై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందుకు ఎమ్మెల్యే గిత్త జయసూర్య, ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానంద రెడ్డి, నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరువెంకటరెడ్డితో పాటు మరికొందరు నాయకులు హాజరయ్యారు. వారందరూ కుర్చీల్లో కూర్చొని ఉండగా వారి పక్కన్నే కుర్చీ లేక గ్రామ మొదటి పౌరురాలైన సర్పంచ్ అంజనమ్మ నిల్చోవాల్సి వచ్చింది. అయినప్పటికీ ఆమెకు కుర్చీ వేయకపోవడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. ఆమె నిల్చొని ఉండటాన్ని విలేకరులు చిత్రీకరిస్తుండటాన్ని గమనించి 20 నిమిషాల తరువాత కుర్చీ తెప్పించి కూర్చోబెట్టారు.